విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ

సిద్దిపేట అర్బన్, జనవరి 21: అన్నిరంగాల్లో సిద్దిపేట ఆదర్శంగా నిలుస్తున్నదని, పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఉత్తరాలు రాశారు. మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆత్మవిశ్వాసం నింపేలా, విద్యార్థులకు మనోధైర్యం ఇచ్చేలా ఉత్తరం రాశారు. పిల్లలను ఇంటి వద్ద శ్రద్ధగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ రెండు నెలలు టీవీలు, సెల్‌ఫోన్లు చూడకుండా చదువుకోవాలని ఉత్తరంలో పేర్కొన్నారు. పిల్లలను విందు వినోదాలు, ఫంక్షన్స్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. తన వంతుగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులతోపాటు సాయంత్రం వేళలో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివించండి.. మీ పిల్లల బంగారు భవితకు బాటలు వేయండి.. అది మీ చేతుల్లోనే ఉందన్నారు. నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు హరీశ్‌రావు ఉత్తరం ఆత్మవిశ్వాసం నింపేలా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయపోల్, జనవరి 21 : దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీఎన్ యజ్ఞశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో మొత్తం సీట్లకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 7,8,9, తరగతుల్లో వివిధ కారణాలతో వెళ్లిపోయిన విద్యార్థుల స్థానంలో ఖాళీ అయిన సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఫిబ్రవరి 22 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముంబై మారథాన్‌లో సిద్దిపేట రన్నర్స్

మారథాన్‌లో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, సీసీఎస్ డీసీపీ శ్వేత

సిద్దిపేట అర్బన్, జనవరి 21 : ముంబైలో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులతోపాటు హైదరాబాద్ సీసీఎస్ డీసీపీ ఎన్.శ్వేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా 42.195 కి.మీ మారథాన్‌ను సిద్దిపేట రన్నర్స్ విజయవంతంగా పూర్తిచేశారు. దేశంలో ఎక్కడ మారథాన్ జరిగినా తాము పాల్గొంటామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మారథాన్‌లో ఎస్సీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, సీఐ కృష్ణ, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, కార్యవర్గ సభ్యులు రాజు, పరంధాములు, వెంకట్, మహేశ్, అశోక్, కృష్ణారెడ్డి, జగదీశ్వర్, రవి, నర్సింహులు, రమేశ్, విజయ్, మురళి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

CHANGE OF NAME

★I, JANGAM BALRAM, R/o. 9-155, Opp: Old Sub-Registrar Office, Gajwel, Siddipet Dist - 502278, TS., changed my name as JANGAM BALRAM GOUD S/o. JANGAM NARAYANA.
NT-319668

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

‘మల్లన్న’ క్షేత్రంలో కరెంట్ కష్టాలు

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- తాగునీటికి ఇబ్బందులు పడ్డ భక్తజనం
- సబ్ స్టేషన్‌కు తరలిన భక్తులు
- బిందెకు రూ.20, డబ్బాకు రూ.50, స్నానానికి రూ.20 వ్యయం
- మొరాయించిన మెయిన్ జనరేటర్

బకెట్లు, గిన్నెల్లో నీటిని కొని తెచ్చుకుంటున్న భక్తులు

చేర్యాల, జనవరి 21 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వామివారి క్షేత్రానికి కరెంటు సరఫరా లేకపోవడంతో గదులకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నీటి అవసరాలు ఉండే ఉదయం పూట కరెంట్ లేకపోవడంతో భక్తుల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. క్షేత్రంలో భక్తులు బస చేసిన గదులకు నీటి సరఫరా లేకపోవడంతో సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి ట్రాన్స్‌కో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఉందని, భక్తులకు సేవలందించ లేకపోతున్నామని ఆలయ సిబ్బంది కొందరు ‘నమస్తే తెలంగాణ’తో వాపోయారు. కరెంట్ సరఫరా లేనప్పుడు తోటబావి వద్ద ఉన్న జనరేటర్ ద్వారా ఆయా బోరుమోటర్లకు కరెంట్ సరఫరా చేసి భక్తులకు సరిపడా నీటిని సరఫరా చేస్తారు. కానీ, ఇదే సమయంలో నీటిని అందించే మోటర్లకు కరెంట్ సరఫరా చేసే మెయిన్ జనరేటర్ సైతం మొరాయించడంతో ఆలయ వర్గాలు చేతులెత్తేశాయి.

బిందెకు రూ.20, క్యాన్‌కు రూ.50..

గుడిలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉండడంతో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు ఇతర దారులు వెతుకున్నారు. సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి బిందెకు రూ.20, స్నానాలకు రూ.20 చెల్లించారు. డబ్బా మంచి నీటికి రూ.50 ఇచ్చి తెచ్చుకున్నారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు

స్వామివారి క్షేత్రంలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్వామివారి పట్నం వారం సందర్భంగా క్షేత్రంలోని వివిధ ప్రదేశాల్లో దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో భక్తులు అక్కడ ప్లాస్టిక్ ప్లేట్స్‌లో ప్రసాదం, పాయసం, అన్నం అందజేశారు. వాటిని కొందరు అక్కడే తినిపడవేయగా, మరికొందరు ఇతర ప్రదేశాల్లో ప్లేట్స్‌ను పడవేయడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. చెత్తపేరుకుపోయిన విషయాన్ని విలేకరులు ఈవో బాలాజీ దృష్టికి తీసుకుపోవడంతో అన్నదాన కార్యక్రమాలను పద్ధతిగా చేసే విధంగా చర్యలు చేపడుతామన్నారు.

ఫలితమివ్వని అమాత్యుల సమీక్షలు

కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, భక్తులకు సకల వసతులు కల్పిస్తామని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షలో చెప్పారు. కానీ, పట్నం వారం రోజున భక్తులు తాగునీటి కష్టాలతోపాటు ఇతరాత్ర అవసరాలకు ఉపయోగించుకునే నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని పలువురు భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కోనేరులో పేరుకుపోయిన చెత్త.. అందులోనే స్నానాలాచరిస్తున్న భక్తులు

అసత్య ప్రచారాలను సహించేది లేదు

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

చేర్యాల, జనవరి 21 : బీఆర్ఎస్ కౌన్సిలర్లపై ఇతర పార్టీ కౌన్సిలర్లు అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపా రాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్ గౌడ్, నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, యాట యాదగిరి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ అవిశ్వాసం వీగిపోయేందుకు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచనలు, ఆదేశాలకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. అవిశ్వాసం ప్రక్రియ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌కు చైర్మన్ పదవి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లే కౌన్సిలర్‌కు వైస్ చైర్మన్ పదవి ఇస్తామని మభ్యపెట్టినట్లు తెలిపారు. మరో కౌన్సిలర్‌కు మార్కెట్ కమిటీలో ముఖ్య పదవి ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఆశపెట్టినా తాము పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం వీగిపోయేందుకు కృషి చేశారని, ఎలాంటి డబ్బులు, పదవులకు లొంగలేదని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు

కంట్రోల్ రూమ్ వద్ద డీసీసీ మల్లారెడ్డి

చేర్యాల, జనవరి 21 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో పట్నం వారం సందర్భంగా అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు) ఎస్.మల్లారెడ్డి 510 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఆదివారం మల్లన్న క్షేత్రంలోని పార్కింగ్ ప్రదేశాలు, శ్రీఘ్రదర్శనం, వీఐపీ దర్శనం, సాధారణ దర్శనం, టెంపుల పరిసరాలను డీసీపీ పరిశీలించారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా కొమురవెల్లి పీఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణ చేస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులున్నా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని చెప్పారు. పోలీసుల సూచనలు, సలహాలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు. ఆయన వెంట హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, ఎస్బీ ఏసీపీ రవీందర్‌రాజు, గజ్వేల్ ఏసీపీ రమేశ్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ చంద్రశేఖర్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

హుస్నాబాద్‌లో గెజిటెడ్ హెచ్ఎంల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 21 : ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను పెంచి నాణ్యమైన విద్య నందించడంతోపాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వచ్చే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రంగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.వెంకటయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి మనీల, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, చీకోటి మహేశ్వర్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటనర్సయ్య ఉన్నారు.

రాజేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి

హుస్నాబాద్ రూరల్, జనవరి 21 : మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని అందించి శాలువాతో సన్మానించారు.

అవినీతికి పాల్పడిన వారిని బదిలీ చేస్తాం

చేర్యాల, జనవరి 21 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులను బదిలీ చేస్తామని ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. కమిటీ కార్యాలయంలో ఆదివారం ఆలయ ఈవో ఏ.బాలాజీతో కలిసి పునరుద్ధరణ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహకారంతో ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తే కొన్ని పార్టీలు విమర్శలకు దిగడం అవివేకమన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, బి.మధు, అల్లం శ్రీనివాస్, జి.వీరభద్రప్ప, పి. శ్రీనివాస్, దామోదర్, తాళ్లపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని రద్దు చేయాలి

బెజ్జంకి, జనవరి 21: మండలంలోని గుగ్గిళ్లలో ఏర్పాటు చేసే ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే రద్దు చేయాలని గ్రామ ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారని తెలిపారు. ఫ్యాక్టరీని రద్దు చేసి గ్రామాన్ని కాపాడాలని ఎమ్మెల్యేను కోరారు.

విజేతలకు బహుమతులు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 21: వినెట్ రఘు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 150 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ గంగిశెట్టి, గంగం రజిత, కోడం రమేశ్, గూడూరి భూమయ్య, ప్రసాద్, రాజమౌళి ఉన్నారు.

జగమంతా రామమయం



మిరుదొడ్డి: మాట్లాడుతున్న తీర్థక్షేత్ర మండల ఇన్‌చార్జి శ్రీనివాస్

సిద్దిపేట అర్బన్: జెండాలను పంపిణీ చేస్తున్న ప్రజలు

సిద్దిపేట టౌన్, జనవరి 21 : అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సిద్దిపేట రామనామస్మరణతో మార్మోగింది. పట్టణంలో ఎటుచూసినా రామదండు కనిపించింది. సిద్దిపేటలో ధర్మకార్య ఉత్సవ సమితి, అన్ని హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మోహినీపుర వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీరామ చంద్రస్వామి వారి శోభయాత్ర నిర్వహించారు. ఈ శోభయాత్ర విక్టరీ చౌరస్తా, పాత బస్టాండ్, సుభాష్‌రోడ్ మీదుగా మార్కెట్ ఎక్స్ రోడ్ హనుమాన్ వరకు, అక్కడి నుంచి నేరుగా వైశ్య భవన్ వరకు కొనసాగింది. శోభయాత్రలో మహిళల కోలాటం, చిన్నారుల ప్రత్యేక వేషధారణ అందరినీ ఆకట్టుకున్నది.

గజ్వేల్‌లో హిందువుల భారీ ర్యాలీ

గజ్వేల్ అర్బన్, జనవరి 21 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం శ్రీకృష్ణాలయ కమిటీ ఆధ్వర్యంలో హిందువులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గజ్వేల్ మురళీ కృష్ణాలయం వద్ద శ్రీకృష్ణాలయ కమిటీతోపాటు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు కొబ్బరికాయ కొట్టి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణాలయ ప్రాంగణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. సాయంత్రం సహస్ర దీపాలను వెలిగించి ఆలయాన్ని అలంకరించారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మిరుదొడ్డి, జనవరి 21 : అయోధ్యలో జరిగే శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర మండల ఇన్‌చార్జి కానుగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22న మండలవ్యాప్తంగా ప్రజలు ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయాలని సూచించారు. అయోధ్యలో జరుగుతున్న రాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం మిరుదొడ్డిలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో శ్రీరామతీర్థ మండల సభ్యులు నర్సింహులు, జ్ఞానేశ్వర్, రాజగోపాలాచారి, పార్థసారథి, రాజపున్నయ్య, రవి, రమేశ్, రోశయ్య, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట టౌన్ : ప్రత్యేక వేషధారణలో చిన్నారుల నృత్యాలు

గజ్వేల్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

శ్రీరాముడి జెండాల పంపిణీ

సిద్దిపేట అర్బన్, జనవరి 21 : అయోధ్యలో శ్రీముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం సిద్దిపేట పట్టణంలోని బృందావన్ కాలనీలో ఇంటింటికీ శ్రీరాముడి జెండాలను రామభక్తులు పంపిణీ చేశారు. సోమవారం ప్రతి ఇంటిపై శ్రీరాముడి జెండాలను ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో బృందావన్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నాణేలతో అయోధ్య రామయ్య

గజ్వేల్, జనవరి 21 : గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం అధ్యక్షుడు రామరాజు ఆదివారం 20 వేల నాణేలను ఉపయోగించి 10 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో అయోధ్య రామమందిరాన్ని అత్యద్భుతంగా రూపొందించారు. ఈ మూడు రోజులపాటు శ్రమించి అయోధ్య రామమందిరాన్ని రూపొందించినట్లు రామరాజు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

హుస్నాబాద్, జనవరి 21 :పట్టణంలోని వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల అధికారులుగా తణుకు ఆంజనేయులు, బెజుగం శ్రీనివాస్ వ్యవహరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా చొల్లేటి శంకరయ్య, అధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గౌరి శెట్టి రాజు, కోశాధికారిగా బబ్బుల రవీందర్, మహిళా విభాగం, యువజన విభాగం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు గంప శ్రీనివాస్, అయిత రత్నాకర్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హుస్నాబాద్ టౌన్, జనవరి 21: డీటీఎఫ్ నూతన సంపత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కవ్వ లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్‌దారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పందిల్ల శంకర్, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి.వెంకటరమణారెడ్డి, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల సభ్యులు డి.సంపత్‌రెడ్డి, ఈర్యానాయక్, బి.ప్రభాకర్, తిరుపతిరెడ్డి, రాజగోపాల్‌రావు, సోమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాయతీ భవనం ప్రారంభం

కొమురవెల్లి, జనవరి 21 : మండలంలోని మర్రిముచ్చాలలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం ఎంపీపీ తలారి కీర్తనాకిషన్, సర్పంచ్ పద్మాకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవన స్థలదాతలు వంగ జగన్నాథ్‌రెడ్డి, వంగ శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

సిద్దిపేట టౌన్, జనవరి 21 : కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో కార్మిక, కర్షక మైత్రి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను మోదీ ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని మండిపడ్డారు. దీంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె, రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి, జనవరి 21 : పీడీఎఫ్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన మిరుదొడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై వై.నరేశ్ వివరాల ప్రకారం.. ప్రభుత్వం రేషన్ దుకాణం ద్వారా పంపిణీ చేస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని మిరుదొడ్డిలో ప్రజల నుంచి ఓ వ్యక్తి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడనే సమాచారం అందడంతో ఆర్ఐ రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 8.20 క్వింటాళ్ల బియ్యంతోపాటు ఏపీ-23, 8823 నంబర్ గల ఆటోను సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

మర్కూక్, జనవరి 21 : మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన వాటర్‌మెన్ చెక్కలి రమేశ్(46) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఎంపీపీ పాండు గౌడ్, జడ్పీటీసీ మంగమ్మారామచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నకోడూరు, జనవరి 21 : మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను సంఘం అధ్యక్షుడు అక్కి సంతోష్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కుండే తిరుపతి, కోశాధికారి రాగుల రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

చిన్నకోడూరు, జనవరి 21: ప్రతిఒక్కరూ తప్పకుండా రక్తదానం చేయాలని సర్పంచ్ ఉమేశ్‌చంద్ర సూచించారు. ఆదివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్లడ్ సేకరణ క్యాంపు కార్యక్రమం ప్రారంభించారు. శిబిరంలో 30 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు, వైద్య బృందం పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య

కరుణాకర్(ఫైల్)

జగదేవ్‌పూర్, జనవరి 21 : ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు మూడు రోజులకు శవమై కనిపించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కరుణాకర్(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18న ఇంట్లో నుంచి కూలీ పన